క్లుప్తంగా

చిన్నారుల కూచిపూడి ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో సోమవారం తెలంగాణలోని చింతల్‌కు చెందిన శ్రీసాయి శివ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ప్రధానంగా శ్రీలక్ష్మీనృసింహుని వేషధారణలోను, ఇతర వేషధారణలోను చిన్నారులు చూపిన నృత్య ప్రతిభకు ఆహుతులు మంత్ర ముగ్ధులయ్యారు. కళాకారులకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్, సిబ్బంది ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. చిన్నారులకు స్వామివారి దర్శనం, భోజనం వసతి ఏర్పాట్లను కూడా సిబ్బంది కలుగజేసింది.

కొత్తపేట ఎంపీడీఓగా నరేష్‌కుమార్



కొత్తపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా పీఎస్ నరేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఈ.మహేశ్వరరావు రావులపాలెం బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కోరుకొండ ఎంపీడీఓగా పనిచేసిన నరేష్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలి

మామిడికుదురు: గ్రామాల్లో తీవ్రంగా ఉన్న విద్యుత్ లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య సమావేశం తీర్మానించింది. సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణకుమారి అధ్యక్షతన నగరం పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పెదపట్నంలంక గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలని సమావేశం కోరింది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశం నిర్ణయించింది. సర్పంచ్‌లకు గౌరవ వేతనం రూ.15 వేలు పెంచాలని కోరుతూ తీర్మానం చేశారు. గ్రామాల్లో జటిలంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతూ సమావేశంలో నిర్ణయించారు. పంచాయతీ అనుమతి లేని లేఅవుట్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్న అంశంపై పలువురు సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో పి.గన్నవరం నియోజకవర్గం సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు, మండల సమాఖ్య కార్యదర్శి బళ్ల శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోతురాజు ప్రసాద్‌కు డాక్టరేట్



నన్నయ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న ప్రసాద్

అయినవిల్లి: నేదునూరు ప్రభుత్వ మహిళా కళాశాల (జెడ్పీ హైస్కూల్ ప్లస్)లో జువాలజీ లెక్చరర్‌గా పని చేస్తున్న పీఆర్‌జీఎస్‌వీ ప్రసాద్ డాక్టరేట్ అందుకున్నారు. జువాలజీలో పరిశోధనలకు గాను రాజమహేంద్రవరంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వై.శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆదివారం రాత్రి డాక్టరేట్ తీసుకున్నారు. ప్రసాద్‌ను విజయ నిర్మల, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పిఠాపురానికి చెందిన ఆకెళ్ళ శ్రీదత్త సూర్యనారాయణ కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతకు వేదపండితులు, అర్చకులు వేదాశీర్వాదం అందజేసి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది అభినందించారు.

11 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పి.గన్నవరం: సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4,23,702లను చెక్కుల రూపంలో సోమవారం తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు దాసరి వీవీ సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్రహ్మణ్యం, మద్దా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీపై శీతకన్ను

- పటిష్టత, సుందరీకరణపై నిర్లక్ష్యం
- జంగిల్ క్లియరెన్స్ ఊసేలేదు
- సందర్శకులకు కొరవడిన కనీస వసతులు
- ఏటా నిధులు ఖర్చు పెడుతున్నట్టు ఇరిగేషన్ అధికారుల డ్రామా



కాటన్ బ్యారేజీ దిగువన బీటలు వారిన గోడ

ఆత్రేయపురం: ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేస్తూ లక్షలాది ఎకరాల పంట భూములకు సాగునీరు అందిస్తున్న ప్రాజెక్టుపై ఇరిగేషన్, హెడ్‌వర్క్స్' అధికారులు అలసత్వం వహిస్తున్నారు. బ్యారేజీ దిగువన పటిష్టత కోసం నిర్మించిన ఆనకట్ట కట్టలు బీటలు వారుతున్నాయి. గత కొన్నేళ్లుగా బ్యారేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. కాటన్ బ్యారేజీ పటిష్టతపై అధికారులు పట్టించుకోక పోవడంతో ఉభయ గోదావరి జిల్లాల రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రతి దాళ్వా వరిసాగుకు చివరిలో నీటి ఎద్దడి ఏర్పడినా ఆ శాఖల అధికారులు ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవడం లేదు. ఎప్పటికప్పుడు రైతులు ఆందోళన చేసినప్పుడు తాత్కాలికంగా కంటి తుడుపు చర్యలు చేపడుతున్నారు. బ్యారేజీ పటిష్టతకు హెడ్‌వర్క్స్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టవలసి ఉంది. గత కొన్నేళ్లుగా బ్యారేజీ పటిష్టతకు గాని, సుందరీకరణకుగాని ఏ విధమైన పనులు చేపట్టలేదు. బ్యారేజీ పటిష్టత కోసం గతంలో చేసిన పనులే ఇప్పటికీ ఉన్నాయి. కానీ కొత్తగా పటిష్టత కోసం నిధులు కేటాయించి పనులు చేపట్టడం లేదు. ఏటా లక్షలాది రూపాయల నిధులు వీటి నిర్వహణకు అధికారులు ఖర్చు చేస్తున్నట్లు తెలపడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్యారేజీ రక్షిత ప్రాంతలో కేవలం జంగిల్ క్లియరెన్స్ కూడా చేపట్టడం లేదు. నిత్యం నీటితో కళకళలాడే బ్యారేజీ చూసేందుకు వేలాది మంది సందర్శకులు వస్తున్నారు. వారికి ఏ విధమైన వసతులు కనీసం టాయిలెట్స్ కూడా నిర్మించలేదు. బ్యారేజీ వెంబడే మొక్కలు పెంపకం జరిగినా సందర్శకులకు ఏ మాత్రం అనువుగా లేవు. కనీసం వన భోజనాలకు ఇక్కడ వసతులు లేవు. గతంలో పాత ఆనకట్ట స్థానే బ్యారేజీ పటిష్టత కోసం నిర్మించిన ఆనకట్ట మొత్తం బీటలు వారి అధ్వానంగా మారింది. దీంతో బ్యారేజీ పటిష్టతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఉభయగోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే కాటన్ బ్యారేజీ పటిష్టతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతుంది.

రోడ్ల ఆధునీకరణ మాటే లేదు

బ్యారేజీపై రోడ్లు చాలా గోతులతో బలహీనంగా ఉన్నాయి. అయినా పర్యాటకం గురించి మాట్లాడే మంత్రులే తప్ప కనీసం కార్తికమాసం వస్తుంది. వివిధ స్కూళ్ల నుంచి పిల్లలు, బ్యారేజీ అందాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తారన్న ఆలోచనే లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, కనీసం మంచినీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు కూడా లేవని వాపోతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఒళ్లు హూనమైపోతుందని ప్రయాణికులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, మంత్రులు వీటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

లక్షల ఎకరాలకు నీటి సరఫరా



కాటన్ బ్యారేజీ ద్వారా ఉభయగోదావరి జిల్లాల్లోని 10.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదు. కాటన్ బ్యారేజీ దిగువ ఆనకట్టు పూర్తిగా పాడైంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి

– కప్పుల శ్రీధర్, ర్యాలి

పటిష్టతకు చర్యలు చేపట్టాలి



బ్యారేజీపై అధికారులు నిఘా ఉంచాలి. ఈ బ్యారేజీకి ముప్పు ఏర్పడితే రైతాంగం పరిస్థితి ఘోరంగా ఉంటుంది. బ్యారేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. బ్యారేజీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

– వేముల శ్రీనివాస్, ర్యాలి

పాలస్తీనాకు మద్దతుగా శాంతి ర్యాలీ

మలికిపురం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ మలికిపురంలో సోమవారం నియోజకవర్గ సీపీఐ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల వల్ల పాలస్తీనాకు చెందిన వేలాది మంది అమాయక ప్రజలు చనిపోయారని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని జామా మసీదు సెంటర్ నుంచి మార్కెట్ రోడ్డు, గాంధీ బొమ్మల సెంటర్ మీదుగా డిగ్రీ కాలేజీ, పద్మజ థియేటర్ మీదుగా గుడిమెళ్లంక వంతెన వరకూ ఈ ర్యాలీ చేశారు. యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, యుద్ధోన్మాదం నశించాలని వారు డిమాండ్ చేశారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి సీహెచ్ తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

నత్తనడకన దరఖాస్తుల ప్రక్రియ

ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ నత్తనడకన సాగుతుంది. సర్కిల్ పరిధిలోని ఆలమూరు, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలాలతో పాటు మండపేట పట్టణంలో 20 దుకాణాలను ఏర్పాటు చేస్తుండగా ఇప్పటి వరకూ కేవలం 27 దరఖాస్తులు మాత్రమే అందాయి. దరఖాస్తుల స్వీకరణకు మరో మూడు రోజులే గడువు ఉన్నందున ఆశించిన స్థాయిలో దరఖాస్తులు అందుతాయని భావిస్తున్నామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఎస్సై పి.రాంబాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు అనుసంధానం చేయాలి



అంబాజీపేటలో తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలను ఉద్యానవన పంటలకు అనుసంధానం చేయడం వల్ల రైతులకు, కూలీలకు మేలు జరుగుతుందని రైతులు పేర్కొన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి రైతులు వినతిపత్రం అందజేశారు. గత నెలలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉపాధి హామీ పథకాన్ని ఉద్యానవన పంటలకు అనుసంధానం చేసి చట్టం చేశారే తప్ప ఆచరణలో కనిపించలేదన్నారు. ఉద్యానవన పంటలకు అనుసంధానం చేయడం వల్ల కొబ్బరితోటల్లో ఎరువులు వేయుటకు, దింపు సమయంలో కొబ్బరికాయలు రాశి చేసేందుకు, అరటి తోటల్లో కలుపు తీతకు తదితర పనులు కల్పించవచ్చన్నారు. టైమ్‌రేట్ బేసిస్ పద్ధతి ప్రకారం ఎం బుక్ రికార్డు చేసి ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని కోరారు. ఉద్యానవన పనులను ఉపాధి కూలీలకు కల్పించడం వల్ల 100 రోజులు పని దినాలు పూర్తి చేసుకోవచ్చన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీకేఎస్ ప్రతినిధులు ముత్యాల జమ్మీలు, కొర్లపాటి కోటబాబు, ఉప్పుగంటి భాస్కరరావు, మట్టపర్తి పరమేశ్వరరావు, ఈతకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

27వ రోజుకు చేరిన అధ్యాపకుల దీక్షలు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షలు సోమవారం 27వ రోజుకు చేరుకున్నాయి. బకాయిపడిన జీతాలు చెల్లించమంటూ న్యాయమైన కోరికతో ఆందోళన చేస్తున్నా మేనేజ్‌మెంట్ జీతాలు ఇవ్వకపోవడం అత్యంత హేయమైన చర్యగా అధ్యాపకులు పేర్కొన్నారు. గ్రామ గ్రామాన దసరా సంబరాలు నవరాత్రుల సమయంలో దీర్ఘకాలం పాటు సేవలందిస్తున్నటు వంటి అధ్యాపకులను క్షోభకి గురి చేస్తూ తీవ్రమైన వేడిలో రోడ్డున పడేసిన సెక్రెటరీ, కరస్పాండెంట్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గెడ్డం పేర్రాజు, నల్లిమోహన్‌రావు, గణపవరం డిగ్రీ కళాశాల అధ్యాపకులు గంటా వెంకట్రావు, నేతల నాని, మాలే కాళిదాసు, రాంపాల్ రాజు, సూర్యప్రకాష్‌రావు తదితరులు అధ్యాపకులకి సంఘీభావం తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి



కొత్తపేటలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట పంచాయతీ కార్యాలయంలో సత్యానందరావు సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రతి సోమవారం ప్రజలను కలుసుకుని సమస్యల వినతులు స్వీకరించి వారిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కొత్తపేట పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో 403 వినతులు వచ్చాయని తెలిపారు. సమస్యలను బట్టి వాటి పరిష్కార సమయం ఉంటుందని అన్నారు. ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బూసి జయలక్ష్మి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మండల జనసేన అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేద్దాం



అంబాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేద్దామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన సోమవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 23న మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించారన్నారు. ఆ సభల్లో వివిధ శాఖల ద్వారా నిర్మాణ పనులకు ఆమోదం తెలిపారన్నారు. హౌసింగ్‌లో ఇళ్ల నిర్మాణాలకు, ఇంజినీరింగ్ శాఖలో డ్రైనేజీల నిర్మాణం, ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు కల్పించేందుకు, ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు, పశు సంవర్ధక శాఖ ద్వారా మినీ గోకులాలు, విద్యుత్ శాఖలో రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు మండల సర్వసభ్య సమావేశంలో ఆమోదం తెలిపారన్నారు. అనంతరం ఎంపీడీఓ సరోవర్ తీర్మానించిన పనుల వివరాలను వివరించారు. హౌసింగ్ శాఖ నుంచి 33 పనులు, ఉపాధి హామీ పనులు 496, పంచాయతీ శాఖ ఇంజినీరింగ్ శాఖ నుంచి 388, ఐసీడీఎస్ నుంచి 5 పనులు, పశు సంవర్ధక శాఖ నుంచి 107 మినీ గోకులాలు, విద్యుత్ శాఖలో 2 పనులను రూ.49.93 కోట్లతో అంచనాతో ఆమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు డి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ఎం.ప్రశాంత్, ఎంపీటీసీలు ఎం.పార్వతి, ఎస్.పండు, పి.రాంబాబు, వాకపల్లి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్

రాజోలు: ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100ను ఏర్పాటు చేసిందని సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి తెలిపారు. సోమవారం రాజోలు కోర్టు కాంప్లెక్స్ వద్ద మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం పొందడం ఎలా అనే అంశాలను వివరించే కరపత్రాలను జడ్జి ఆవిష్కరించారు. లోక్‌అదాలత్‌ల ద్వారా పెండింగ్‌లో ఉన్న అనేక కేసులను పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, ఉపాధ్యక్షుడు చింతా ప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యురాలు జి.రజిత, న్యాయవాదులు చెల్లింగి వెంకటేశ్వర్లు, మెడబల రాజ్‌కుమార్, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

సాక్షి కథనంపై మండల సమావేశంలో చర్చ



సమావేశంలో కళాశాలల తీరుపై ఎంఈఓ విజయశ్రీని వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో గత రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బట్టేలంక, కేశనపల్లి, రామేశ్వరం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని విద్యా శాఖ అధికారులను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదేశించారు. గత సెప్టెంబరు నెల 9న 'సాక్షి' పత్రికలో ప్రచురణ అయిన 'గురువులే సర్కారుకు బరువు' శీర్షికన ప్రచురితమైన కథనంపై సోమవారం మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ మూడు కళాశాలల్లో బోధన సిబ్బంది తక్కువగా ఉన్నారని దీనిపై అధికారులు తీసుకున్న చర్యలను తెలపాలన్నారు. ఎమ్మెల్యే సూచనలపై ఎంఈఓ ఎం.వి జయశ్రీ మాట్లాడుతూ ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారులు కళాశాలలను సందర్శించారని అవసరమైన పోస్టులను తాత్కాలికంగా భర్తీ చేశారని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా బోధన సిబ్బంది ఉన్నారని, మౌలిక వసతుల కల్పన కూడా చేశారని ఆమె చెప్పారు. అలాగే ఈ కళాశాలల్లో స్థలాలను ఉపాధి హామీ పథకంలో చేర్చి మెరక చేయాలని కూడా ఎమ్మెల్యే సూచించారు. ఇంకా ఎమ్మెల్యే మాట్లాడుతూ వశిష్ట నదిపై మంజూరైన వంతెనతో పాటు దిండి-సీతారామపురం బైపాస్ రోడ్డు నిర్మాణంలో నెలకొన్న అడ్డంకులను అధిగమించాలని సూచించారు. కేసులను తొలగించి తక్షణమే వంతెన రోడ్డు పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం అందరం కృషి చేయాలన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు.

విద్యుత్ కనెక్షన్లు తొలగించండి

కేశనపల్లి- కరవాక మధ్య సముద్ర తీరంలోని గోగన్నమఠం డ్రైన్ ఆక్రమణ చెరువులను తొలగించాలని ఇందులో భాగంగా చెరువులకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే శంకరగుప్తం ఎత్తిపోతల పథకం కోసం వేసిన విద్యుత్ లైన్‌పై అక్రమంగా చెరువులకు ఇచ్చిన 70 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని కూడా ఆదేశించారు. బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ పీవీ రాజును దీనిపై నివేదిక ఇచ్చాకే రిలీవ్ కావాలని ఆదేశించారు. ఇంకా రోడ్లు, నాడు-నేడు భవనాల పనులు నిలిచిపోవడంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నలకు అధికారులు వివరణ ఇచ్చారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన జరిగిన సభలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మండల ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాలనపై అవగాహన ఉండాలి



కొత్తపేటలో ఉప సర్పంచ్, సభ్యుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు


కొత్తపేట: మండలంలోని 10 గ్రామాల పంచాయతీ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయం' నినాదాన్నిచ్చిన గాంధీ చిత్రపటానికి ఎంపీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు విధులు, బాధ్యతలు పెరుగుతాయన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉంటుందన్నారు. ఎంపీడీఓ నరేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సాధారణ కనీస పాలన విధానం, ఏపీ పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు, గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల్లో తాగునీరు నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యనారాయణ, పలువురు ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉప సర్పంచ్‌లు, ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు ఎంపీడీఓ టీకేఎస్ఎస్ వెంకట్రామన్ శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిపాలన, ఆదాయ, వ్యయాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఆస్తుల పరిరక్షణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అలాగే గ్రామ పంచాయతీ పరిపాలన, అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మామిడికుదురు: గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిధిలోని 18 గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాగునీటి పథకాల నిర్వహణ, పారిశుధ్యం, ఉపాధి హామీ పనులు, తదితర అంశాలు గ్రామ పంచాయతీల పరిధిలో ఉంటాయన్నారు. వాటిని పంచాయతీ పాలక వర్గాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబాజీపేట: గ్రామాల్లో ఉన్న పంచాయతీల పాలనపై ప్రతి వార్డు సభ్యుడికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా ప్రరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిపాలన విధానం, ఏపీఆర్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రెండోరోజు మంగళవారం కూడా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పంట కాలువల్లో మురుగునీరు కలవకుండా చూడాలి



కొత్తపేటలో ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆదిత్యకిరణ్

కొత్తపేట: వీధుల్లోని డ్రైన్లలో మురుగునీటిని పంట కాలువల్లో కలవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సోషల్ సొల్యూషన్స్ ఎన్జీవో సభ్యుడు సత్తిరాజు ఆదిత్యకిరణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆదిత్యకిరణ్ సామాజిక కార్యకర్తలు గుబ్బల మూర్తి, పెదపూడి బాపిరాజుతో కలసి ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలువల్లోకి మురుగునీరు మళ్లించడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగు నీటిని డ్రైన్ల ద్వారా మేజర్ డ్రైన్లకు కలపాలని, అలా కాకుండా రైతులకు సంబంధించిన పంట కాలువలో కలవడం వలన జీవ వైవిధ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. వరి, ఉద్యాన పంటలకు కావలసిన నాణ్యమైన నీరు లభ్యం కావడం లేదని, మురుగునీరు, సెప్టిక్ ట్యాంక్‌ల నీరు కలవటం వలన పంటకు తెగుళ్లు ఏర్పడి దిగుబడి తగ్గుతోందని పేర్కొన్నారు. కలుషితమైన నీరు మనుషులకి, పశువులకి ఉపయోగించడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా వివిధ సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్టు కార్యాలయ సిబ్బంది తెలిపారు. వివిధ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహాచండీ.. నమోస్తుతే..

- వివిధ రూపాల్లో జగన్మాత దర్శనం
- భక్తుల ప్రత్యేక పూజలు



ఉచ్చిలిలో మహాచండికా దేవిగా విజయదుర్గాదేవి

మామిడికుదురు: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు శక్తి స్వరూపిణిగా భక్తులతో పూజలందుకుంటున్నారు. ఐదో రోజు అమ్మవారి ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. పెదపట్నంలంక కనకదుర్గమ్మ స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడిబాడవలో కొలువుదీరిన అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు.

అంబాజీపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయకనకదుర్గ ఆలయంలోను, మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోను కుంకుమ పూజలు నిర్వహించారు. వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ఆదిశేష వాహనంపై మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు.

ఆత్రేయపురం: మండలంలోని ఆలయాల్లో సోమవారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజరాజేశ్వరి, కనకమహాలక్ష్మి, మల్లమ్మ, విజయదుర్గా దేవి, కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఉచ్చిలిలో వేంచేసిన విజయదుర్గాదేవి అమ్మవారు మహాచండికా దేవిగా దర్శనమిచ్చారు.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు సోమవారం మహాచండికా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిగింది.

అయినవిల్లి: మండలంలోని ముక్తికాంత క్షణముక్తేశ్వర స్వామివారి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవి అమ్మవారికి సోమవారం ప్రత్యేక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.